ప్రజాశక్తి
మంగళవారం 28 అక్టోబరు, 2025
5
శ్రీకాకుళం



అవసరం మేరకు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

శ్రీకాకుళం సిటీ : శ్రీకాకుళం శాసనసభ నియోజకవర్గంలో అవసరం మేరకు నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ ఎస్.వి. లక్ష్మణమూర్తి అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు, ఓటర్ల జాబితా కూర్పు అశాలపై సోమవారం సమీక్షించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి సలహాలు స్వీకరించారు. వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఎక్కువ సమయం పోలింగ్‌కు పట్టిన చోట్ల ఓటర్లు విభజించి కొత్త పోలింగ్ కేంత్రాలు ఏర్పాటు చేయాలన్నారు. 1200 ఓట్లు దాటిన కేంద్రాలు విభజించాలని సూచించారు. ఆర్‌డిఒ మాట్లాడుతూ శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంలోని 279 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 1200 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలలు 45 ఉన్నాయని అన్నారు. కొత్తగా ఈ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే సకాలంలో పోలింగ్ పూర్తవుతుందని చెప్పారు. తహశీల్దార్ ఎస్.గణపతిరావు, టిడిపి నాయకులు ఎం.వెంకటేష్, కాంగ్రెస్ నుంచి ఈశ్వరి, వైసిపి నుంచి ఆర్.శంకరరావు, బిజెపి నుంచి ఎస్.తేజేశ్వరరావు, పురుషోత్తం పాల్గొన్నారు.

సరుబుజ్జిలి - పాలకొండ రహదారిపై నిరసన తెలుపుతున్న గిరిజనులు



అరెస్టులు... అడ్డగింతలు

- థర్మల్ ధర్నా జరగనీయకుండా పోలీసుల ఆటంకాలు
- లెక్క చేయని గిరిజనం
- సరుబుజ్జిలిలో రోడ్డుపై బైఠాయించి జోరువానలోనే ఆందోళన
- వామపక్ష, గిరిజన, ప్రజాసంఘాల నాయకుల అరెస్టు, విడుదల

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, సిటీ, సరుబుజ్జిలి

బూర్జ-సరుబుజ్జిలి ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటును నిరసిస్తూ సరుబుజ్జిలి తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం చేపట్టిన మహాధర్నా అరెస్టులు, అడ్డగింతలతో ఉద్రిక్తంగా మారింది. ప్రజలకు, పర్యావరణానికి నష్టం కలిగించే థర్మల్ పవర్ ప్లాంట్‌ను రద్దు చేయాలని కోరుతూ థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ సరుబుజ్జిలిలో మహాధర్నాకు పిలుపునిచ్చింది. ధర్నాకు భారీగా గిరిజనులు వస్తారనే అంచనాతో శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద ఆధ్వర్యాన ముగ్గురు సిఐలు, పది మంది ఎస్‌ఐలు పెద్దసంఖ్యలో కానిస్టేబుళ్లు సరుబుజ్జిలి మండల కేంద్రం, వెన్నెలవలస, పాలకొండ రహదారిపై భారీగా మోహరించారు. తహశీల్దార్ కార్యాలయం చుట్టుపక్కలతో పాటు పాలకొండ రోడ్డులో పలు ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా పోలీసులను మోహరించారు. పోలీసులు సరుబుజ్జిలికి వచ్చే అన్ని మార్గాలను దిగ్బంధించారు. వామపక్ష, గిరిజన, ప్రజాసంఘాల నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావును శ్రీకాకుళం నగరంలోని డే అండ్ నైట్ కూడలి వద్ద అరెస్టు చేసి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణను మెళియాపుట్టి మండలం చాపరలో గృహ నిర్బంధం చేశారు. ఆదివాసీ గిరిజన పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వంకల మాధవరావును అడ్డారిపేటలో అరెస్టు చేసి పోలాకి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న, థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు సవర సింహాచలం, కొన్న శ్రీనివాస్, బి.సంతోష్‌తో పాటు పలువురిని ఎక్కడికక్కడ పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. సరుబుజ్జిలి తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు కె.మోహనరావు, పి.తేజేశ్వరరావు, సిర్ల ప్రసాద్, ఎ.రాజు, ఎస్.గోపాలరావుతో పాటు పలువురిని అరెస్టు చేసి సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టుల విషయం తెలుసుకున్న గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సరుబుజ్జిలికి బయలుదేరారు. వీరిని చిగురువలస కూడలిలో నిలువరించేందుకు పోలీసులు ప్రయత్నించడంతో, జోరు వానలోనే రోడ్డుపై బైఠాయించి తమ ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. రోడ్డుపై చాలా సమయం ఆందోళన చేయడంతో బత్తిలి-అలికాం, సరుబుజ్జిలి-పాలకొండ రహదారులపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. అరెస్టు చేసిన వారిని విడిచిపెడతామని చెప్పడంతో గిరిజనులు ఆందోళనను విరమించారు.



సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావును అరెస్టు చేసిన పోలీసులు

నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

థర్మల్ పవర్‌ప్లాంట్ ఉద్యమకారులపై రాష్ట్ర ప్రభుత్వ దమనకాండను సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, చాపర వెంకటరమణ, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు తదితరులు తీవ్రంగా ఖండించారు. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా, థర్మల్ పవర్‌ప్లాంట్ ప్రతిపాదన రద్దు చేయాలని కోరుతూ సరుబుజ్జిలి తహశీల్దార్ కార్యాలయం వద్ద శాంతియుతంగా ధర్నా చేసేందుకు వెళ్లిన వారిపై ప్రభుత్వం నిర్బంధకాండను ప్రయోగించి ఉద్యమకారుల్ని అక్రమ అరెస్టులకు పాల్పడడం అన్యాయమన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడుకు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాజ్యాంగం గుర్తొస్తుందని, అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు నిర్బంధం ప్రయోగిస్తారని ప్రశ్నించారు. థర్మల్ పవర్‌ప్లాంట్ పేరుతో ప్రజల భూములను కార్పొరేట్ భూములుగా మార్చడమే అభివృద్ధా అని ప్రశ్నించారు. 2018 నుంచి జిల్లా కేంద్రంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన క్రీడాకారులను అందించిన కోడిరామ్మూర్తి స్టేడియంకి నిధులు కేటాయించని ప్రజాప్రతినిధులు అభివృద్ధి కోసం మాట్లాడతారా అని ఎద్దేవా చేశారు. జిల్లాలో ఒకవైపున అణు విద్యుత్కేంద్రం, మరోవైపు థర్మల్ పవర్ ప్లాంట్, ఇంకోవైపు కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో ప్రజల సంపదను కార్పొరేట్ సంపదగా మార్చేయడానికి ఎందుకు పూనుకుంటున్నారో చెప్పాలని ప్రశ్నించారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే జిల్లా సస్యశ్యామలమవుతుందని, పెండింగ్ ప్రాజెక్టులకు ఎందుకు నిధులు కేటాయించడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, ప్రభుత్వ భూ దోపిడీని ప్రజలు ప్రతిఘటిస్తారని హెచ్చరించారు.



ప్రజాసంఘాల నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు



బూర్జ మండలం అల్లెనలో నేలకొరిగిన వరి పంట

'మొంథా' ప్రభావం మొదలు

- జిల్లాలో పలుచోట్ల భారీ వర్షాలు
- గార, పోలాకిలో అత్యధికంగా 65 మి.మీ వర్షం
- తుపాను సన్నద్ధతకు అనుక్షణం అధికారుల అప్రమత్తత

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పోలాకి, సంతబొమ్మాళి

మొంథా తుపాను ప్రభావం జిల్లాలో సోమవారం దాని ప్రభావం మొదలైంది. ఉదయం ఆరు గంటల సమయంలో సాధారణంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా ఆకాశంలో మేఘాలు కమ్ముకున్నాయి. క్రమేణా వర్షాలు కురవడం ప్రారంభించాయి. సాయంత్రమయ్యేసరికి వర్షాలు జోరందుకున్నాయి. ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో విద్యాసంస్థలకు అధికారులు సెలవు ప్రకటించారు. తుపాను నేపథ్యంలో అధికారులు నిరంతరం యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూనే ఉన్నారు.

మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. జిల్లాలో సగటున 19.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 50 మి.మీకి మించి జిల్లాలో రెండు చోట్ల వర్షపాతం నమోదైంది. గార, పోలాకి మండలాల్లో అత్యధికంగా 65 మి.మీ వర్షం కురిసింది. సరుబుజ్జిలి మండలం విజయరామపురంలో 58మి.మీ, పలాసలో 51 మి.మీ వర్షం కురిసింది. వజ్రపుకొత్తూరులో 43.4 మి.మీ, పోలాకిలో 42 మి.మీ మందసలో 30.8 మి.మీ వర్షం కురిసింది. నరసన్నపేటలో 28.6 మి.మీ వర్షం, శ్రీకాకుళంలో 24.8 మి.మీ, ఇచ్ఛాపురంలో 24..2 మి.మీ, నందిగాంలో 24 మి.మీ, బూర్జలో 22.6 మి.మీ, జి.సిగడాంలో 22 మి.మీ వర్షం పడింది.కంచిలిలో అత్యల్పంగా 1.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

క్షేత్రస్థాయిలో అధికారుల పర్యటన

తుపాను నేపథ్యంలో జిల్లా ప్రత్యేక అధికారి కె.వి.ఎన్ చక్రధరబాబు సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. జిల్లా యంత్రాంగం చేపట్టిన ముందస్తు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించేందుకు ఆయన ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డితో కలిసి పోలాకి మండలం దండులక్ష్మీపురం, సంతబొమ్మాళి మండలం కొల్లిపాడు, ఎం.సున్నాపల్లిలో పర్యటించారు. తీర ప్రాంత గ్రామాల్లో తుపాను రక్షిత భవనాలు, ప్రజలను తరలించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాలు, అక్కడ నిల్వ చేసిన ఆహార సామాగ్రి, మందులు ఇతర నిత్యావసరాలను పరిశీలించారు. ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూడాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని ఆదేశించారు. రైతులు, మత్స్యకారులు తుపాను హెచ్చరికలు పాటించేలా చూడాలని చెప్పారు.

ఇన్‌ఛార్జి కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్

తుపాను ప్రభావం పెరుగుతున్న దృష్ట్యా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎస్‌పి మహేశ్వర రెడ్డితో కలిసి కలెక్టరేట్ నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో వినియోగించే జెసిబిలు, పవర్ కట్టర్లు, అంబులెన్స్‌లు, జనరేటర్లు, వాహనాల తదితర వివరాలు అన్ని శాఖల వద్ద సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా, ప్రసవ తేదీ దగ్గర పడిన గర్భిణులను వెంటనే ఆస్పత్రుల్లో చేర్పించాలన్నారు. ఇప్పటికే 158 మంది గర్భిణులను పలు ఆస్పత్రులకు తరలించినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత తెలిపారు. వచ్చే మూడు రోజులు ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పనిచేయాలని, సెల్ ఫోన్ ఆపరేటర్లు విద్యుత్ సరఫరా వ్యవస్థ సహా అన్ని కీలక వ్యవస్థలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

అధికారులతో మాట్లాడిన మంత్రి అచ్చెన్న

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. తుపానుపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్లపై చెట్లు కూలితే వెంటనే తొలగించేలా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పునరావాస శిబిరాల సమాచారం ఎప్పటికప్పుడు ప్రజలకు అందించాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గాలుల తీవ్రతకు విద్యుత్ స్తంభాలు పడిపోతే వెంటనే పునరుద్ధరించాలని సూచించారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని చెప్పారు.



పోలాకి : అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి చక్రధర్‌బాబు



క్వాంటమ్ సాంకేతికత

విద్యార్థుల భవిష్యత్‌కు బలమైన పునాది

ఆర్‌జియుకెటిలో ముగిసిన అంతర్జాతీయ క్విసిక్ ఫాల్ ఉత్సవం

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

క్వాంటమ్ సాంకేతికత నేటి విద్యార్థుల భవిష్యత్‌కు బలమైన పునాది వంటిదని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నూతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, ట్రిపుల్ ఐటి విద్యార్థులు జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్థానిక ట్రిపుల్ ఐటి ప్రాంగణంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న 'క్విసిక్ ఫాల్ ఉత్సవం-2025' సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకత, ఉత్సాహం మధ్య క్వాంటమ్ హాకథాన్ విజయవంతంగా ముగియడం ఈ ఉత్సవానికి మరింత శోభ తెచ్చిందన్నారు. ఐటి రంగంలో దేశంలో రాష్ట్రం భవిష్యత్‌లో అగ్రగామిగా నిలవడం ఖాయమన్నారు. ఈ అంతర్జాతీయ ఉత్సవం క్వాంటమ్ సాంకేతిక విజ్ఞానానికి మరొక మైలురాయి కావడమే గాక, విద్యార్థులలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. వారం రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా వచ్చిన నిపుణుల ప్రసంగాలు, ఆచరణాత్మక కార్యగోష్ఠులు నిర్వహించి, విద్యార్థులకు క్వాంటమ్ గణన (కంప్యూటింగ్)పై లోతైన అవగాహన కల్పించారని, ఈ హాకథాన్‌లో విద్యార్థులు క్వాంటమ్ సమస్యలకు పరిష్కారాలు చూపుతూ తమ ప్రతిభను ప్రదర్శించారని తెలిపారు. క్వాంటమ్ శాస్త్ర రంగంలో యువతకు ప్రేరణగా నిలిచిన ఈ ఉత్సవంలో విశ్వవిద్యాలయ సంచాలకులు ఆచార్య కొక్కిరాల వెంకటధన బాలాజీ, పరిపాలనా అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివ రామకష్ణ, ఆర్థిక అధికారి డాక్టర్ వాసు, సమన్వయకర్తలు డాక్టర్ రవి, కంప్యూటర్ శాస్త్ర విభాగపతి రమేష్ తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ అత్యవసర సేవలకు సిద్ధం

శ్రీకాకుళం సిటీ: మొంథా తుపాను నేపథ్యంలో విద్యుత్‌శాఖ అత్యవసర సేవలకు సిద్ధంగా ఉందని ఎపి ఇపిడిసిఎల్ ఎస్ఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలకు అనుగుణంగా యంత్రాంగం సిద్ధంగా ఉందని అన్నారు. మంగళవారం నుంచి 31 వరకు విపత్తు హెచ్చ రికలు ఉన్నాయని అన్నారు. ఈదురు గాలులు, వర్షాలకు అవకాశం ఉన్నందున విద్యుత్ సేవలకు అంతరాయం కల్గే అవకాశం ఉందని చెప్పారు. హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శ్రీకాకుళం డివిజన్‌కు 9490610050, పలాస డివిజన్‌కు 9490610045, టెక్కలి డివిజన్‌కు 08945-241084 ఫోన్ నంబర్లుకు సమస్య చెప్పవచ్చునని తెలిపారు. సరఫరా సమస్య, స్తంభాలు కూలడం వంటి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. విద్యుత్ సరఫరా పుణరుద్ధరణ చర్యల్లో భాగంగా ఇప్పటికే 255 మంది వర్కర్లు, 15 వరకు వాహనాలు, క్రేన్స్ పోల్ డ్రిల్లింగ్ మెషీన్లు ఆరు, చెట్లు తొలిగించేందుకు పవర్ సాస్‌లు, విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు 30, విద్యుత్ స్తంభాలు 700 వరకు తీరప్రాంత మండలాల్లో సిద్ధం చేశామన్నారు. 1083 సెల్ టవర్స్ వద్ద జనరేటర్లను ఏర్పాటు చేసేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. అత్యవసర సేవల అందించే ఆస్పత్రులు, వాటర్ వర్క్స్, సెల్ టవర్స్, హెచ్‌టి వినియోగదారులు తప్పని సరిగా జనరేటర్లను పూర్తిస్థాయిలో డీజిల్ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యుత్ వినియోగదారులందరూ తగుభద్రతా సూచనలు పాటించాలన్నారు. తడిగా ఉన్న విద్యుత్ స్తంభాలను తాకడం, వేలాడుతూ ఉన్న విద్యుత్ వైర్లను పట్టుకోవడం, వాటి కింద నుంచి నడవడం, విద్యుత్ వైర్లు చెట్లకొమ్మలపై పడితే చెట్లను తాకడం వంటివి చేయకూడదన్నారు. మీ ప్రాంత విద్యుత్ అధికారులకు, హెల్ప్ డెస్క్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు శ్రీకాకుళం సర్కిల్ కార్యాలయం హెల్ప్ డెస్క్ నంబరు 9490612633, ఎపిఇపిడిసిఎల్ సెంట్రలైజ్డ్ టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలన్నారు.

కార్గో ఎయిర్‌పోర్టు సర్వే అడ్డగింత

ప్రజాశక్తి - మందస

మొంథా తుపాను నేపథ్యంలో ప్రజలు చెట్ల కింద, తోటల్లో తిరగొద్దని చెప్తున్న అధికారులు.. కార్గో ఎయిర్‌పోర్టు సర్వే కోసం మాత్రం సోమవారం వచ్చారు. రెవెన్యూ, సర్వే అధికారులు వచ్చారన్న విషయం తెలుసుకున్న బిడిమి, రాంపురం గ్రామస్తులు వారిని అడ్డగించారు. ఒక్క సెంటు భూమి కూడా కార్గో ఎయిర్‌పోర్టుకి ఇచ్చే పరిస్థితి లేదని చెప్తున్నా, మళ్లీ తమ భూముల్లో కొలతలకు ఎందుకు వస్తున్నారని తహశీల్దార్ శ్రీకాంత్‌తో వాగ్వివాదానికి దిగారు. పచ్చని భూములను, తమ జీవనాధారాన్ని పోగొట్టుకునేందుకు సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. మొన్నటి వరకు భూములు ఇస్తామని చెప్పిన వారూ ఇప్పుడు తమ భూములు ఇవ్వబోమని తమతో కలిసి పోరాడుతున్నారని కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు తెలిపారు. కార్గో ఎయిర్‌పోర్టు నిర్ణయాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష పునరాలోచన చేయాలని కోరారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ ప్రజల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తానని అక్కడ్నుంచి వెనుదిరిగారు. కార్యక్రమంలో కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు, రైతులు నల్ల పరుశురాం, జుత్తు గున్నయ్య, పుక్కల్ల నారాయణ, దున్న సురేష్, గుంటు లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ శ్రీకాంత్‌తో వాగ్వివాదానికి దిగిన గ్రామస్తులు



నిందితులను ప్రవేశపెట్టిన ఎఎస్‌పి శ్రీనివాసరావు

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

- బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం
- ఎఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలో వివిధ చోట్ల చోరీలకు పాల్పడిన అంతర్ జిల్లా దొంగల ముఠాకు చెందిన ముగ్గురిని ఆరెస్టు చేసి వారి నుంచి 186 గ్రామల బంగారం, 263 గ్రామల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు అదనపు ఎస్‌పి పి.శ్రీనివాసరావు వెల్లడించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇంటికి, బీరువాలకు వేసిన తాళాలు చాకచక్యంగా తీయడంలో ముగ్గరు నేరస్థులు సిద్ధహస్తులని అన్నారు. ఇటీవల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రిపూట చోరీల కేసులను విజయవంతంగా ఛేదించి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. రూరల్ స్టేషన్ పరిదిలో నందగిరిపేటలో రెండు, రాగోలులో ఒకటి, గార పోలీస్‌స్టేషన్ పరిధిలోని కె.మత్యలేశంలో మూడు చోరీ కేసులు నమోదైనట్టు వివరించారు. నిందితులు రాత్రిపూట ఇంటి తలుపులకు వేసిన తాళాలను పగలగొట్టి ఇంట్లోని బంగారం, వెండి ఆభరణాలు, నగదును దొంగలించినట్టు తెలిపారు.

పట్టుబడిన వారిలో కాకినాడకు చెందిన రేకడి వెంకటేశ్వరులపై 23 కేసులు నమోదు కాగా, కాకినాడ ఫోర్త్ టౌన్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ ఉందని అనానఁ్ర. నిందుతుడు ధర్మాది ప్రసాద్‌పై 36 కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. కాకినాడ వన్ టౌన్ సస్పెక్ట్ షీట్ ఉందని తెలిపారు. విశాఖలో నివాసం ఉంటున్న మాడెం మోహన్ ఈ నెల 26న మధ్యాహ్నం 3 గంటలకు శ్రీకాకుళం మండలం తండేవలస వైపు ఉన్న జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసులను శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద పర్యవేక్షణలో శ్రీకాకుళం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.పైడపునాయుడు, రూరల్ ఎస్ఐ కె.రాము, సిబ్బంది సమన్వయంతో చాకచక్యంగా ఛేదించారని తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకొని చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నందున ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి అభినందించారని అన్నారు.

వసతిగృహాలు... మురుగుకూపాలు

- మురుగునీటితో విద్యార్థుల అవస్థలు
- తప్పని దోమల బెడద
- వెంటాడుతున్న తాగునీటి సమస్య

ప్రజాశక్తి - కవిటి, ఇచ్ఛాపురం

పేద విద్యార్థులకు విద్య, వసతి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ వసతిగృహాలు సమస్యలకు నిలయంగా మారాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగా అక్కడి విద్యార్థులు సమస్యలతోనే సహవాసం చేస్తున్నారు. కవిటి మండలంలోని కొత్తపాలెంలో ప్రశాంత వాతావరణంలో ఏర్పాటైన కెజిబివి వసతిగృహానికి మురుగునీరు శాపంగా మారింది. అలల సవ్వడిలో.. ప్రకృతి ఒడిలో మత్స్యకార కుటుంబాలు, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు ఈ విద్యాసంస్థ ఆశాజ్యోతిగా నిలుస్తున్నా, సదుపాయాల లోపం వారి విద్యాభ్యాసానికి అడ్డంకిగా మారుతోంది. ఆరు నుంచి పదో తరగతి వరకు 202 మంది, ఇంటర్మీడియట్‌లో 51 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలో మొత్తం 253 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల, వసతిగృహం పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండి మురుగుకూపంగా మారింది. నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో దుర్గంధంతో పాటు దోమలకు నిలయంగా మారుతోంది. వసతిగృహం పక్కన ఖాళీ స్థలం పిచ్చిమొక్కలు, తుప్పలతో ఉంది. పాఠశాల ఆవరణలో విస్తారమైన స్థలం ఉన్నా అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో విద్యార్థులకు క్రీడా స్థలం అందుబాటులో లేకుండా పోయింది. మరోవైపు తాగునీటి సమస్య కూడా వేధిస్తోంది. గ్రామంలోని బోర్లన్నింటిలో ఉప్పు నీరు రావడంతో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి ప్రతిరోజూ మినరల్ వాటర్ తెప్పించడమే కాకుండా హాస్టల్‌లో వంటకు కూడా బయట నుంచి నీటిని సమకూర్చుతున్నారు. ఇక్కడి పరిస్థితులను ఇప్పటికే ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అదిగో, ఇదిగో అనడమే తప్ప సమస్యల పరిష్కారానికి ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. పి.కె పాలెంలోని బాలుర వసతిగృహం ఎదురుగా ఉన్న ఊటగుమ్మి దోమలకు నిలయంగా మారింది. వంటశాలకి దగ్గరగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



కవిటి : కొత్తపాలెం కెజిబివి వద్ద నిలిచిన మురుగునీరు

రాజపురం బాలుర వసతిగృహంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. బోరు నీటిని కాచి వడబోసి విద్యార్థులకు అందిస్తున్నా, కొంతమంది విద్యార్థులు ఈ నీటి వల్ల గొంతు సమస్యలు వస్తున్నాయని చెప్తున్నారు. ప్రజాప్రతినిధులు, దాతలు ముందుకొచ్చి తమకు మినరల్ వాటర్ అందించాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

దోమల బెడద

ఇచ్ఛాపురంలోని బిసి బాలురు వసతిగృహ విద్యార్థులకు దోమల బెడదతో రాత్రుళ్లు కంటి మీద కునుకు కరువవుతోంది. ఈ వసతిగృహంలో 35 మంది విద్యార్థులు ఉన్నారు. చలికాలం ప్రారంభమైనా ఇంకా రగ్గులు, దుప్పట్లు అందించలేదు. ఒకవైపు చలి, మరోవైపు దోమలు బెడద ఎక్కువ కావడం మరింత ఇబ్బందులు పడుతున్నారు. పడుకునేందుకు బెడ్స్ లేకపోవడంతో నేల మీదే నిద్రిస్తున్నారు. దుప్పట్లు లేకపోవడంతో రాత్రిళ్లు చలికి తట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వసతిగృహంలో కనీస సౌకర్యాల లేమి కారణంగా చదువుపై దృష్టిసారించలేకపోతున్నామని విద్యార్థులు చెప్తున్నారు. విద్యార్థులకు దుప్పట్లు, రగ్గులు వచ్చాయని, తుపాను తగ్గిన తర్వాత హాస్టల్‌కు తెస్తామని వార్డెన్ కాంతారావు తెలిపారు.



కవిటి : పికె పాలెం వసతిగృహం వద్ద ఊటగుమ్మి



ఇచ్ఛాపురం బిసి బాలుర వసతిగృహం

జోరుగా కురుస్తున్న వాన

భయం గుప్పిట్లో నదీ పరివాహక గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి- బూర్జ

మొంథా తుపాన్ ప్రభావంతో మండలంలో సోమవారం జోరుగా వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రహదారులన్నీ జలమయమయ్యాయి. పచ్చని పంటలు ముంపునకు గురయ్యాయి. నారాయణపురం ఆనకట్ట వద్ద నాగావళి నది పరవళ్లు తొక్కుతుంది. ఇప్పటికే సుమారు 15 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉందని జల వనరుల శాఖ జెఇ రామశివాజీ తెలిపారు. ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. మండలంలోని నాగావళి నదీతీర గ్రామాలైన నారాయణపురం, లాభాం, గుత్తావల్లి, చిన్నలంకాం, పెద్దలంకాం, వావాం, ఉప్పపేట, బూర్జ, అల్లిన, కిలాంతరి, జి.వి.పురం, వైశ్యర్ల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తుపాను కారణంగా ఎప్పుడు తమ గ్రామంలోకి వరదనీరు ప్రవేశించి ముప్పు వాటిల్లుతుందోనని భయంగుప్పిట్లో బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా ఉన్నతాధికారులు ఆయా గ్రామ ప్రజలను పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో అప్రమత్తం చేశారు. ఆముదాలవలస ప్రత్యేక అధికారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి పి.కిరణ్‌కుమార్ ఆయా శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులకు, ప్రజలకు పలు సూచనలను చేశారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.


బూర్జ : నారాయణపురం ఆనకట్ట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నాగావళి


బూర్జ : నేలకొరిగిన చెరకు

మొక్కజొన్న రైతుల్లో గుబులు

లావేరు: మొంథా తుపాను ప్రభావం ఎక్కువగా ఉంటుందని ప్రజలను ప్రభుత్వం, అధికార యంత్రాంగం అప్రమత్తం చేయడంతో పాటు మూడురోజుల పాటు దీని ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో మండలంలోని మొక్కజొన్న రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. మండలంలో అధికశాతం రైతాంగం మొక్కజొన్న పంటను సాగుచేస్తున్నారు. ఇప్పుడు పండిన పంట కళ్లాల్లో, రోడ్లపైన ఎండబెడుతున్నారు. ఈ తుపాను ప్రభావంతో మొక్కజొన్న పంటను తడవకుండా ఉండేందుకు కప్పుటకు పరదాలు వేస్తూ పరదాలు లేక మరికొంతమంది రైతులు పంట తడిసిపోతుందని, పంట తడిసిపోకుండా అనేక పాట్లు పడుతున్నారు. కోసిన పంట పొలాల్లో ఉండగా, మరికొంత కళ్లాల్లో ఉండగా కొంత పంట కొయ్యడానికి ఉండడంతో ఈ తుపాను గండం నుంచి ఎలా గట్టెక్కుతామోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కళ్లాల్లో ఉన్న పంటను వర్షం వస్తే కప్పడం, తగ్గితే పరదా తీయడం పనితో రైతులు సతమతమవుతున్నారు.


లావేరు: మొక్కజొన్న పంటను టార్పాలిన్‌తో కప్పుతున్న రైతు


మెళియాపుట్టి : పొలాలను పరిశీలిస్తున్న ఎడి రామారావు

పొలాల్లో నీరు నిల్వ ఉంచరాదు

ఆమదాలవలస: మొంథా తుఫాను వర్షాల కారణంగా పంటలు దెబ్బతినే ప్రమాదం ఉన్న నేపథ్యంలో పొలాల్లో నీరు నిల్వ కాకుండా వెంటనే కాలువల ద్వారా తొలగించాలని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. వర్షాల వల్ల పంటలు పడిపోతే నీరునిల్వ కాకుండా కాలువలు ఏర్పాటు చేసి మోటార్ ద్వారా బయటకు పంపాలని సూచించారు.

మెళియాపుట్టి : పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని పలాస వ్యవసాయ శాఖ ఎడి మండేలా రామారావు అన్నారు. మండలంలోని కొసమాలలో రైతులతో కలిసి వరి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎఒ దానకర్నుడు, వ్యవసాయ సహాయకులు క్రాంతి పాల్గొన్నారు.

సోంపేట : వరి చేను చిరు పొట్ట దశ నుంచి కంకి దశ వరకు చేరిందని, ఇటువంటి పరిస్థితిలో నీరు ఎక్కువ నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. మండలంలోని వరి పొలాలను సోమవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. వెన్ను బయటికి రాకపోతే 24 నుంచి 36 గంటలు ముంపు ఉన్నా ఇబ్బంది ఉండదని అన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉండి కంకి బయటికి వచ్చి ఉన్న పొలాల్లో అధిక నీరు నిలువ ఉండకుండా కింది ప్రాంతాలకు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలనానరు.

పలాస : మొంథా తుపాను కారణంగా కూరగాయల రైతులు అప్రమత్తంగా ఉండాలని పలాస ఉద్యానవనశాఖ అధికారి శంకర్ దాస్ రైతులకు సూచించారు. మండలంలోని పెదంచల, అల్లుకోల, పలాస తదితర ప్రాంతాల్లో కూరగాయల సాగును పరిశీలించారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు.

గుబులు పుట్టిస్తోంది

కవిటి: మొంథా తుపాను గుబులు పుట్టిస్తోంది. అలలు ఎగసిపడుతూ తీరాన్ని తాకుతున్నాయి. ముఖ్యంగా అక్టోబరు, నవంబరు నెలల్లో తుపాను ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన ఉద్దానం రైతాంగం బిక్కుబిక్కుమంటూ గడుపుతోంది. ఏ క్షణం ఏం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది. 1999 సూపర్ సైక్లోన్‌తో ప్రారంభమైన ఈ భయం తిత్లీతో తీవ్ర రూపం దాల్చింది. మరోవైపు ఉదయం నుంచి వర్షంతో పాటు చిరుగాలులు ప్రారంభం కావడంతో రైతుల ఆందోళన మరింత రెట్టింపైంది. అయితే సాయంత్రం 4 గంటల వరకూ గ్యాప్ ఇచ్చినా మళ్లీ గాలితో పాటు వర్షం ప్రారంభం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాలుల తీవ్రత కొంచెం పెరిగినా ఉద్దాన పంటలకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల ప్రత్యేక అధికారి సిహెచ్.చంద్రశేఖర్, తహశీల్దార్ మురళీమోహన్, ఎస్ఐ రవివర్మ తీరప్రాంతంలో పర్యటించి మత్స్యకారులను అప్రమత్తం చేశారు. కవిటి తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై దిశా నిర్దేశం చేశారు. 9 సమస్యాత్మక తీర ప్రాంత గ్రామాలు గుర్తించి పూర్తి ముందస్తు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. మండలంలో ముత్యాలపేట, కవిటి, ఇద్దివానిపాలెం, కుసుంపురం, మాణిక్యపురం గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎటువంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని, అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండని తహశీల్దార్ తెలిపారు. ఎంపిడిఒ త్రినాథ్, ఎంఇఒ ధనుంజయ మజ్జి, ఉద్యానశాఖ అధికారి మాధవీలత, ఎఒ శ్రీదేవి, మండలంలో అధికారులు, విఆర్ఒలు, కార్యదర్శులు సమావేశంలో పాల్గొన్నారు.

ఉధృతంగా అలలు

ఇచ్ఛాపురం : తుపాను ప్రభావంతో సముద్రంలో అలలు ఉధృతంగా ఉన్నాయి. అధికారులు అప్రమత్తమై సమీపంలోని తుపాను రక్షితకేంద్రానికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

అన్నదాత గుండెల్లో అలజడి

టెక్కలి : మొంథా తుపాను అన్నదాత గుండెల్లో అలజడి నెలకొంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో తుపాను వర్షాలు, గాలులతో వరిచేను వంగి పోయే పరిస్థితి ఉంది. వాతావరణశాఖ చేసిన హెచ్చరికల మేరకు భారీగా ఈదురుగాలులు వీస్తాయని చెప్పడంతో పంట పరిస్థితి ఏమిటనేది రైతులకు అంతుచిక్కడం లేదు. మండలంలో 27 పంచాయతీల్లోని గ్రామాల్లో 16,318 ఎకరాల్లో వరిపంట వేశారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో పంట ఎదుగుదల బాగానే ఉంది. వరిచేను కోతకు వచ్చే సమయంలో తుపాను నష్టాన్ని మిగిల్చే అవకాశం ఉంది.


ఎగసిపడుతున్న అలలు

అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

మొంథా తుపాను హెచ్చరిక నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఒక ప్రకటనలో కోరారు. మంగళ, బుధవారాలు తుపాను ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు తెలిపారు. వర్షంతో పాటు, సముద్రం కూడా అల్లకల్లోలంగా ఉంటుందన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని కోరారు. రైతులు ఎవ్వరూ ఆందోళన చెందవద్దని సూచించారు. విద్యుత్, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని సూచించారు.

పలాస : మొంథా తుపాను నేపథ్యంలో నియోజకవర్గం ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదన్నారు. సహాయక చర్యల కోసం బృందాలు సిద్ధంగా ఉండాలన్నారు.

తుపానుపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు సంబంధిత అధికారులకు ఆదేశించారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షించారు.

ఇచ్ఛాపురం : మొంథా తుపానుపై అప్రమత్తంగా ఉండాలని డ్వామా పీడీ బి.సుధాకరరావు ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. వ్యవసాయం, తాగునీరు, ఇరిగేషన్, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి తహశీల్దార్ వెంకటరావు, ఎంపిడిఒ ప్రభాకరరావు, డిటి శ్రీహరి ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి రాజేశ్వరి, ఎఒ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండల పరిషత్ కార్యాలయంలో జెడ్‌పి సిఇఒ, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్‌రాజు మొంథా తుపానుపై మండలస్థాయి అధికారులతో సమీక్షించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. పంటల నష్టం, విద్యుత్, రవాణా వ్యవస్థల పరిస్థితిపై అధికారుల నుంచి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, డిటి కె.రాము, ఎఒ ఎస్.దానకర్నుడు పాల్గొన్నారు.

అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి, పలాస వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రామారావు ఆధ్వర్యాన తుపాను పరిస్థితులపై సమీక్షించారు. గ్రామ స్థాయిలో అంచనాలు వేసి అవసరమైన సహాయ చర్యలను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, డిటి కె.రాము, ఎఒ దాన కర్ణుడు, ఎంఇఒలు ఎస్.దేవేంద్రరావు, ఎం.పద్మనాభరావు పాల్గొన్నారు.

కంచిలి : మండలంలో తుపాను ప్రభావ పరిస్థితులపై అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, ఎంపిడిఒ వి.తిరుమలరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.


ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న డ్వామా పీడీ సుధాకరరావు

సోంపేట : మండలంలోని బేసిరామచంద్రపురం, బాతుపురం గ్రామాల్లో వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవనీశంకరరావు, తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఎంపిడిఒ ఈశ్వరమ్మ, వ్యవసాయాధికారి బి. నరసింహమూర్తి, డిప్యూటీ ఎంపిడిఒ వెంకట్‌లు తుపాను నేపథ్యంలో పర్యటించారు.

మొంథా తుపాను నేపథ్యంలో బారువ, పరిసర మత్స్యకారులను మెరైన్ సిఐ రమేష్‌కుమార్ అప్రమత్తం చేశారు. సందర్శకులు ఈ నెల 27, 28, 29,30 వరకు బారువ, రట్టి, పుక్కళ్ల పాలెం బీచ్‌లకు, సముద్ర తీరంలో స్నానాలు చేయరాదని సూచించారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని వజ్రపుకొత్తూరు, మంచినీళ్లపేట, హుకుంపేట, మెట్టూరు, గుణుపల్లి, చినవంక, తదితర తీర ప్రాంతాల్లో తహశీల్దార్ డి.సీతారామయ్య, ఎంపిడిఒ ఎస్.రమేష్‌నాయుడు, మండల సర్వేయర్ కె.తిరుపతిరావు, టిడి శ్రావణ్‌కుమార్‌లు పర్యటించారు. పునరావాస కేంద్రాల్లో బియ్యం, ఇతర నిత్యవసర సరుకులు, జనరేటర్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

సంతబొమ్మాళి : మొంథా తుపాను ప్రభావంతో తీర ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ బి.హేమసుందర్, ఎంపిడిఒ పి.జయంతి ప్రసాద్ సూచించారు. మండలంలోని మరువాడ గ్రామాన్ని సందర్శించిన మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. సర్పంచ్ ప్రతినిధి సూరాడ దాసురాజు, ఎఎంసి డైరెక్టర్ సూరాడ ధనరాజు మాట్లాడుతూ తుపాను కారణంగా మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింటుందని, వారికి నిత్యావసర సరుకులు, కుటుంబానికి 50 కిలోల బియ్యం అందించాలని కోరారు. మరువాడ, మేఘవరం పంచాయతీల పరిధిలో పంట పొలాలు నీటమునిగాయని, రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. అనంతరం తహశీల్దార్ తుపాను సెల్టర్‌ను పరిశీలించి, అత్యవసర సమయంలో ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విఆర్ఒ ఎం.సాయికుమార్, మత్స్యకార సంఘం అధ్యక్షుడు గంట లోకేష్, నాయకులు సూరాడ కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ దనుంజయ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తూరు : మొంథా తుపాను ప్రభావంతో ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చూడాలని తహశీల్దార్ కె.బాలకృష్ణ, సిఐ చింతాడ ప్రసాద్‌లు సూచించారు. మండలంలోని దిమిలి, కురిగాం, కుద్దిగాం, పొన్నుటూరు, సోమరాజుపురం గ్రామాల్లో ఉన్నత పాఠశాలలను పరిశీలించి పునవాస కేంద్రాలుగా గుర్తించామన్నారు. కార్యక్రమంలో హెచ్‌సి కోటేశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి ఎద్దు సంతోష్‌కుమార్, విఆర్ఒ గిరీష్‌కుమార్ పట్నాయక్ పాల్గొన్నారు.

రణస్థలం: మొంథా తుఫాను నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రణస్థలం మండల ప్రత్యేక అధికారి వి.శ్రీనివాసరావు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. తీర ప్రాంతంలోని అన్ని గ్రామాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో అప్రమత్తం చేయాలని ఆదేశించారు. శిధిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. మండలంలో కొచ్చెర్ల, జీరుపాలెం, కొవ్వాడ, నారాయణ గజపతిపురం తదితర గ్రామాల్లో పునరావాసానికి ప్రత్యేక అధికారులను నియమించామని, వారందరూ స్థానిక సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలతో సమావేశాలు నిర్వహించి తపానుపై అప్రమత్తత చేయాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వృద్ధులకు అవసరమైన మందులు సరఫరా చేయాలన్నారు. రోడ్లకు అవాంతరం కలిగేలా చెట్లు పడిపోతే వెంటనే తొలగించేలా జెసిబి లను సిద్ధం చేసుకోవాలని, పంట నష్టం జరగకుండా వ్యవసాయ, హార్టికల్చర్ శాఖలు రైతులకు తగు సూచనలు చేయాలన్నారు. నిరంతరం శానిటేషన్ జరిగేలా, క్లోరినేషన్, మంచినీరు అందేలా పంచాయతీరాజ్ శాఖ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుఫాను తీరం దాటే వరకు మండల అధికారులు క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ సనపల కిరణ్‌కుమార్, ఎంపిడిఒ ఈశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- అరసవల్లి

అరసవల్లి సూర్యనారాయణ స్వామిని సోమవారం ఎపి జెన్‌కో ఎమ్‌డి, జిల్లా ప్రత్యేకాధికారి కె.వి.ఎన్ చక్రధర బాబు దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆశీర్వదించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ చక్రవర్తి, సిబ్బంది పాల్గొని స్వామివారి ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు.

త్వరితగతిన గ్రామ కమిటీల ఏర్పాటు

నరసన్నపేట : గ్రామ కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ వైసిపి నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల 10 లోపు మండల అనుబంధ విభాగాల కార్యవర్గ సభ్యులు, గ్రామ కమిటీ సభ్యులు పూర్తి చేసి కార్యాలయానికి పంపించాలన్నారు. కమిటీ సభ్యులకు ఐడి కార్డు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపిలు ఆరంగి మురళీధర్, వాన గోపి, ముద్దాడ భైరాగినాయుడు పాల్గొన్నారు.

వాషింగ్ మిషన్లు సిద్ధం

టెక్కలి : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విశ్వకర్మ పథకంలో భాగంగా టెక్కలి పోస్టల్ కార్యాలయానికి వాషింగ్ మిషన్లు సరఫరా అయ్యాయి. ఈ మేరకు సోమవారం టెక్కలి కార్యాలయానికి 22 వాషింగ్ మిషన్లు వచ్చాయి. వీటిని లబ్ధిదారులకు అందివ్వనున్నట్టు టెక్కలి పోస్టల్ కార్యాలయ అధికారి ఎన్.తిరుపతిరావు తెలిపారు. చేతి వృత్తిదారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన విశ్వకర్మ పథకం ద్వారా వీటిని పంపిణీ చేస్తామని తెలిపారు.

టెట్ మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాంపు ఇవ్వాలని స్కూల్ టీచర్స్ అసోషియేషన్ జిల్లా సహాధ్యక్షుడు నెమలపురి విష్ణుమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో రివ్యూపిటిషన్ దాఖలు చేయకుండా హడావిడిగా టెట్ నోటిఫికేషన్ జారీ చేయడం అన్యాయమన్నారు. టెట్ నోటిఫికేషన్ తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని విద్యా హక్కు చట్టం 2009లోని సెక్షన్ 23ని సవరించే విధంగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిస్థితిని చక్క దిద్దేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. 20 నుంచి 30 ఏళ్ల సర్వీసు ఉన్న ఉపాధ్యాయులకు ఇప్పుడు టెట్ పరీక్ష నిర్వహించడమేంటని ప్రశ్నించారు. అదీ టెట్ సిలబస్ చూస్తే జీవశాస్త్ర ఉపాధ్యాయులు గణితం రాయాలన్నారు. గణితశాస్త్ర ఉపాధ్యాయులు జీవశాస్త్రం రాయాలనడం ఎంత వరకు సమంజసమో ఆలోచన చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సుప్రీం కోర్టులో రివ్యూపిటిషన్ దాఖలు చేయాలని మాండ్ చేశారు.


ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

ఇంటిబాట పట్టిన విద్యార్థులు

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల, ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతిగృహం, కెజిబివి, గిరిజన ఆశ్రమ పాఠశాలలల విద్యార్థులు ఇంటి బాట పట్టారు. మొంథా తుపాను నేపథ్యంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు ప్రభుత్వం సెలవులను ప్రకటించింది. తల్లిదండ్రులు తమ పిల్లను పంపించాలని కోరడంతో అధికారులు విద్యార్థులను ఇళ్లకు పంపించారు.

నేడు మెళియాపుట్టి మండల సమావేశం

మెళియాపుట్టి : ఈ నెల 28న మండల సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రానా ఈశ్వరమ్మ అధ్యక్షతన ఉదయం 11.30 గంటలకు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. విధిగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పూర్తి సమాచారంతో మండల అధికారులు పాల్గొవాలని సూచించారు.


కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జెసిఐ ప్రతినిధులు

ఘనంగా జెసీస్ జోన్ కాన్ఫరెన్స్

శ్రీకాకుళం: జెసీస్ ఇంటర్నేషనల్ సంస్థ జోన్ కాన్ఫరెన్స్ విశాఖపట్నంలోని గాదెరాజు ప్యాలెస్‌లో అత్యంత వైభవంగా ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించారు. జెసిఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షుడు కూన అనిల్‌కుమార్, కార్యదర్శి తమ్మినేని ఉషారాణి నేతృత్వంలో ఏడాది కాలంలో చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తిస్తూ జెసిఐ ఇంటర్నేషనల్ సంస్థ పలు అవార్డులను అందించింది. కమ్యూనిటీ డెవలప్‌మెంట్, మేనేజ్‌మెంట్ అండ్ పబ్లిక్ రిలేషన్స్, ట్రైనీ ప్రోగ్రామ్స్‌కు రెండేసి అవార్డులు లభించగా, జెసిఐ వారోత్సవాలు, ఔట్‌స్టాండిరగ్ సెక్రటరీ విన్నర్, ఔట్ స్టాండిరగ్ ఎరో, క్లాసికల్ డ్యాన్స్ పెర్మామెన్స్‌కు చెరో అవార్డు చొప్పున పది అవార్డులు అందుకుంది. ఏడాది కాలంలో ప్రెసిడెంట్ అనిల్‌కుమార్ సారధ్యంలో పలు అవార్డులను అందుకోగా, సెక్రటరీగా తమ్మినేని ఉషారాణి, డ్యాన్స్ పెర్మామెన్స్‌లో సనపల స్నేహాంజలి అవార్డులు, సర్టిఫికెట్లు, మెడల్స్ అందుకున్నారు. కార్యక్రమంలో జెసిఐ శ్రీకాకుళం వ్యవస్థాపక అధ్యక్షులు డా.జామి భీమశంకర్, సెనేటర్ నటుకుల మోహన్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు మణిశర్మ, లయన్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, పొన్నాడ రవి, టెక్కం రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

పొందూరు: మండలంలోని లక్ష్మీపేట - బాణం రహదారిలో ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను జెసిబి సాయంతో సోమవారం తొలగించారు. రహదారిలో మలుపులు అధికంగా ఉండడంతో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు కారణంగా ఎదురెదురుగా వచ్చిన వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను, ముళ్ల పొదలను తొలగించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కిల్లారి భాస్కరరావు, సెక్రటరీ శంకరరావు, సచివాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ప్రొక్లెయినర్‌తో తొలగిస్తున్న పిచ్చి మొక్కలు

చదరంగంపై ఆసక్తి కనబర్చాలి

ప్రజాశక్తి- టెక్కలి

విద్యార్థులు చదువుతో పాటు మేదస్సుకు పదునుపెట్టే చదరంగం క్రీడపై ఆసక్తి కనబరచాలని టెక్కలి డిఎస్‌పి లక్ష్మణరావు కోరారు. స్థానిక ఆల్వాజెన్ స్కూలక్షలో సోమవారం జిల్లాస్థాయి చదరంగం పోటీలను ప్రారంభించి విద్యార్థిలతో కొద్దిసేపు ఆడారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 228 మంది క్రీడాకారులు పాల్గొన్నట్టు చదరంగం అసోసియేషన్ నిర్వాహకులు సనపల భీమారావు తెలిపారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 94 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అండర్-15 విభాగంలో ప్రథమస్థాయంలో యశ్వంత్, ద్వితీయ స్థానంలో బగాది కార్తికేయ విజేతలుగా నిలిచారు. అండర్-12 విభాగంలో ప్రథమస్థానంలో ఎన్.భార్గవ్, ద్వితీయ స్థానంలో శేషాద్రి విజేతగా నిలిచారు. విజేతలకు ఆల్వాజెన్ స్కూల్ డైరెక్టర్ కోత మురళీధర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వర్మ, సునీల్, మేరీ, అసోసియేషన్ ప్రతినిధులు బగాది కిషోర్, జామి రమేష్, ఆవినాష్, లోకేష్, చలపతిరావు, అభినవ్, పాల్గొన్నారు.


చదరంగం పోటీలను ప్రారంభిస్తున్న డిఎస్‌పి లక్ష్మణరావు


ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రతాప్

నైతిక విలువలపై అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి


నైతిక విలువలపై అవగాహన పెంచుకోవాలని టెక్కలి కేంద్ర పోస్టల్‌శాఖ ఎఎస్‌పి డి.వి.ఎన్.ప్రతాప్ అన్నారు. పోస్టల్‌శాఖ ఆధ్వర్యాన చేపడుతున్న విజిలెన్స్ వారోత్సవాలను సోమవారం టెక్కలి తంతితపాలా కార్యాలయంలో ప్రారంభించారు. ఈ వారోత్సవాలు నవంబరు 2 వరకు నిర్వహిస్తామని అన్నారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. వారోత్సవాల్లో భాగంగా సారవకోట మండలం మహసింగి, మెళియాపుట్టి మండలం పెద్దపద్మాపురం, సంతబొమ్మాళి మండలం ఆకాశలక్కవరం, కొటబొమ్మాళి మండలం యలమంచిలి, జర్జంగి గ్రామాల్లో అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో టెక్కలి పోస్టుమాస్టర్ ఎన్.తిరుపతిరావు, ఉద్యోగులు పి.అప్పారావు, వినయ్‌కుమార్, కె.గోపాల్, ఎస్.ప్రకాశరావు, ఎం.తిరుపతిరావు పాల్గొన్నారు.

సచివాలయం వద్ద గ్రామస్తుల ఆందోళన

- 15 రోజులుగా తాగునీరు కరువు
- ఉప్పినవలసలో తాగునీటికి కటకట

ప్రజాశక్తి- బూర్జ

గత 15 రోజులుగా గ్రామంలో తాగునీరు సరఫరా చేయకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నామని, అధికారులు దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం శూన్యమని మహిళలు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మండలంలోని ఉప్పినవలస సచివాలయం వద్ద ఆందోళన చేపట్టారు. కార్యదర్శి జితేంద్రకుమార్‌ను నిలదీశారు. ఒకవైపు తుపాను మరోవైపు తాగునీరు లేక తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులకు ఒకసారి రోజు తప్పించి రోజు కొళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని చెప్పిన అధికారులు ఇప్పటికీ 15 రోజులు అవుతున్నప్పటికీ ఆ మాటే మరిచారని మహిళలు తెలిపారు. కనీస అవసరాలకు, తాగేందుకు కూడా నీరు లేకపోతే తాము ఎలా ఉండాలో అధికారులు తెలియజేయాలని పట్టుబట్టారు. తాగునీటి కోసం విలవిలలాడు తున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న తహశీల్దార్ వై.వి పద్మావతి అక్కడికి చేరుకున్నారు. ఆమెకు గ్రామస్తులు తమ సమస్యను వివరించారు. తాగునీరు సరఫరా లేకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కార్యదర్శికి ఆదేశించారు.


కార్యదర్శితో మాట్లాడుతున్న తహశీల్దార్ పద్మావతి

పనిచేసే వారికి సముచిత స్థానం

మాజీ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

వైసిపిలో పనిచేసే వారికి సము చిత స్థానం లభిస్తుందని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి రాష్ట్ర గ్రీవెన్స్ విభాగ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన సౌర ఢిల్లీరావుకు వైసిపి బిసి విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమితులైన మందస మండలం ఎంపిపి డొక్కరి దానయ్యకు కాశీబుగ్గ గాయత్రి మాన్షన్ ఎస్టేట్‌లో సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో అందాల శేషగిరిరావు, అగ్గున సూర్యారావు, బత్తిన వెంకట్, సేనాపతి కిషోర్, డొక్కరి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు

పోలీసుల తనిఖీ

సోంపేట : మండలంలోని కొర్లాం జాతీయ రహదారి వద్ద సోమవారం డాగ్ స్క్వాడ్‌తో గంజాయి నిల్వలపై పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నార్కోటిక్ డాగ్ రాణితో షాపులు, గొడౌన్లను వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో బారువ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న పోలీసులు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- రణస్థలం

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముక్తుం పురంలో చోటుచేసుకుంది. వివరాల్లోనికి వెళ్తే... మండలంలోని ముక్తుంపురం గ్రామానికి చెందిన మంత్రి పెద్ద అప్పలనాయుడు (37) పైడిభీమవరం డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమలో ఎన్ఎంఆర్‌గా పని చేస్తున్నారు. సోమవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసైన అప్పలనాయుడు రోజూ భార్య రోజాతో గోడవ పడేవాడు. ఆయన మృతికి కుటుంబ కలహాలే కారమని గ్రామస్తులు తెలిపారు. మృతుడు భార్య రోజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ ఎస్.చిరంజీవి దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజానాస్పత్రికి తరలించారు.


మృతి చెందిన పెద్ద అప్పలనాయుడు


చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

కందిరీగల దాడిలో 25 మందికి గాయాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కార్తీకమాసం సోమవారం కావడంతో గ్రామస్తులు తమ బంధువులతో కలిసి ఓ తోటలో వన భోజనాలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమయంలో అక్కడే ఉన్న కందిరీగలు ఒక్కసారిగా దాడి చేయడంతో చిన్న, పెద్ద తేడా లేకుండా 25 మంది వరకు గాయపడ్డాడు. కార్తీకమాసం మొదటి సోమవారం పురస్కరించుకొని బలరాంపురం తోటల్లో అదే గ్రామానికి చెందిన 40 మంది వన భోజనాలకు వంట వండుతున్నారు. చెట్టుపైకి పొగ వెళ్లడంతో ఒక్కసారిగా కందిరీగలు చెలరేగి దాడి చేశాయి. వెంటనే ఇచ్ఛాపురం ప్రభుత్వాస్పత్రికి ఆటోలో తరలించారు. వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు.

శ్రీనివాసరావు సేవలు ఆదర్శం

కోటబొమ్మాళి : ఎఆర్ కానిస్టేబుల్ కీర్తిశేషులు శ్రీనివాసరావు సేవలు సమాజానికి ఆదర్శంగా తీసుకోవాలని కాకినాడకు చెందిన మూడో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.మన్మథరావు అన్నారు. మండలంలోని నీలంపేటకు చెందిన రొక్కం శ్రీనివాసరావు 1992 ఎపిఎస్‌సి బాచ్‌కు చెందిన వాడన్నారు. ఆయన గ్రేహౌండ్స్‌లో పనిచేస్తూ... విధి నిర్వహణలో భాగంగా పార్వతీపురం దగ్గర కొమరాడ మండలం కొప్పాడంగిలో 1998 ఆగస్టు 8న జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరులయ్యారని తెలిపారు. పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం నీలంపేటలో శ్రీనివాసరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. శ్రీనివాసరావు భార్య అలివేణి, తల్లి మాణిక్యం, సర్పంచ్ సావిత్రమ్మ, గ్రామ పెద్దలు రొక్కం కళ్యాణ్‌సాగర్, ఎస్. వైకుంఠరావు, పి.ఆనందరావు, బాల భాస్కరరావు పాల్గొన్నారు.

